


7న తొమ్మిది వాహనాలు వేలం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో నిరర్థకంగా పడి ఉన్న తొమ్మిది వాహనాలను ఈ-వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి టి.వి బాలమురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి మార్చి 7వ తేదీన ఉదయం 11 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ-వేలం పోర్టల్ https://konugolu.ap.gov.in పరిశీలించాలని సూచించారు. ఈ-వేలం నిబంధనలు అందులో పొందుపరచినట్లు తెలిపారు.





ప్రశాంతంగా పోలింగ్





ఓటు వేసేందుకు క్యూ లైన్‌లో ఉన్న ఉపాధ్యాయ ఓటర్లు

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 94.72 శాతం
- ఎల్ఎన్‌పేటలో శతశాతం ఓటింగ్
- పలుచోట్ల ఓటర్లకు కూటమి నాయకుల ప్రలోభాలు
- లావేరులో కూటమి నాయకుల స్వీట్ బాక్సుల పంపిణీ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో గురువారం నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. జిల్లాలో 94.72 శాతం పోలింగ్ నమోదైంది. ఎల్.ఎన్ పేట మండలంలో శతశాతం ఓటింగ్ నమోదైంది. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను గట్టి పోలీసు బందోబస్తు మధ్య విశాఖపట్నంలోని ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి మొత్తం 5,035 మంది ఓటర్లు ఉండగా 4,769 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో 3,416 మంది పురుషులకు గానూ 3,239 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,619 మంది మహిళలకు గానూ 1530 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ ద్వారా జిల్లావ్యాప్తంగా ఉన్న పోలింగ్ కేంద్రాల పరిస్థితిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పర్యవేక్షించి, పోలింగ్ సిబ్బందికి ఎప్పటికప్పుడు సూచనలు చేశారు. పోలింగ్ పర్యవేక్షణకు అన్ని కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ పరిశీలించారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి మహేశ్వర రెడ్డి







కలెక్టర్, ఎస్‌పి పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ సరళిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సరళిని, భద్రతాపరమైన అంశాలను క్షేత్రస్థాయిలో వారు చూశారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ ఎంహెచ్ స్కూల్ కేంద్రాన్ని సందర్శించారు. ఓటర్లతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎచ్చెర్లలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి భద్రతాపరమైన అంశాలపై ఆరా తీశారు.



లావేరులో ఓటర్లకు స్వీట్ బాక్సులు పంపిణీ

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లావేరులో కూటమి నాయకులు గుట్టుచప్పుడు కాకుండా స్వీట్ బాక్సులను పంపిణీ చేశారు. లావేరు పోలింగ్ కేంద్రం సమీపంలో పాకలపాటి రఘువర్మ మద్దతుదారులు ఏర్పాటు చేసిన శిబిరం వద్ద ఎన్నికల తాయిలాలు పంపిణీ చేపట్టారు. ఓటు వేసేందుకు వచ్చిన ఉపాధ్యాయులకు ఓటరు స్లిప్పులను అందిస్తూ ఓటు వేసిన వచ్చిన తర్వాత స్వీట్ బాక్సులను తీసుకెళ్లాలని సూచించారు.

పోలింగ్ శిబిరాల వద్ద కూటమి నాయకుల హడావుడి

ఎమ్మెల్సీ అభ్యర్థి పాకలపాటి రఘువర్మకు మద్దతుగా పోలింగ్ కేంద్రాలకు సమీపంలో ఏర్పాటు చేసిన శిబిరాల వద్ద కూటమి నాయకులు, శ్రేణుల హడావుడి కనిపించింది. శిబిరాల వద్ద ఓటర్లకు స్లిప్పులు జారీ చేస్తున్న ఉపాధ్యాయులతో పాటు వారూ కూర్చొన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన వారిని పలకరిస్తూ కనిపించారు. శ్రీకాకుళం నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన శిబిరాన్ని ఎమ్మెల్యే గొండు శంకర్, లావేరులో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సందర్శించారు. ఉపాధ్యాయులతో ఫొటోలు తీసుకున్నారు.

రేపట్నుంచి ఇంటర్ పరీక్షలు

- హాజరు కానున్న 40,356 మంది విద్యార్థులు
- 75 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు
- 75 మంది పరీక్షల పరిశీలకుల నియామకం
- పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నాపత్రాలు భద్రం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటర్మీడియట్ విద్యార్థులకు మార్చి ఒకటో తేదీ నుంచి వార్షిక పరీక్షలు ఆరంభమవుతున్నాయి. పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ బోర్డు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మార్చి ఒకటి నుంచి ఇంటర్ ప్రథమ, మూడో తేదీ నుంచి ద్వితీయ ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమై, మధ్యాహ్నం 12 గంటల వరకు ముగుస్తుంది. పరీక్షలకు జిల్లాలో 75 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 40,356 మంది పరీక్షలు రాయనున్నారు. అందులో 22,789 మంది ప్రథమ సంవత్సరం విద్యార్థులు కాగా 17,567 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాస్తారు. 145 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్న వారితో పాటు గతంలో పరీక్ష తప్పిన విద్యార్థులు సైతం పరీక్షలకు హాజరవుతారు. పరీక్షల నిర్వహణకు ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాల మేరకు ఇప్పటికే మూడు సెట్‌ల ప్రశ్నాపత్రాలను సిద్ధం చేసి, ఆయా మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లలో గల స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు.

పరీక్షా కేంద్రాలను నిర్వహిస్తున్న కళాశాలలకు ఆన్సర్ షీట్లను పంపించారు. మరోవైపు పరీక్షల నిర్వహణలో భాగంగా 75 కేంద్రాలకు గానూ 1500 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షా కేంద్రానికి ఒకరు చొప్పున 75 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, ఏడు స్క్వాడ్ బృందాలు, 75 మంది ప్రత్యేకాధికారులను నియమించారు. పరీక్ష సమయంలో విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుంది. ఒఎంఆర్ షీట్లను నింపిన తర్వాత ఆన్సర్ షీట్లలో జవాబులు రాయాల్సి ఉంటుంది.



ఏర్పాట్లు పూర్తి

ఇంటర్ పరీక్షల నిర్వహణకు 75 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశాం. ఇప్పటికే పరీక్ష ప్రశ్నాపత్రాలతో పాటు ఆన్సర్ షీట్లు జిల్లాకు చేరుకున్నాయి. పరీక్ష సమయానికి అరగంట ముందే విద్యార్థులు చేరుకోవాలి. అన్ని రూట్లలో ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడిపేలా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలు జారీ చేశారు. వైద్య బృందాలు పరీక్షా కేంద్రాల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

- ప్రగడ దుర్గారావు, ఆర్ఐఒ

పరీక్షలకు ముందు ఇలా...

ఎంత ప్రణాళికాబద్ధంగా చదివినా పరీక్షలు సమీపిస్తున్నప్పుడు విద్యార్థులకు ఒత్తిడి సహజం. ఈ సమయంలో తీసుకునే చిన్న చిన్న జాగ్రత్తలే సన్నద్ధతను మరింత మెరుగుపరుస్తాయి. సమయాన్ని ఏమాత్రం వృథా చేయకూడదనే ఉద్దేశంతో కొందరు ఏకధాటిగా చదువుతుంటారు. దీనివల్ల ఏకాగ్రత లోపించడంతో పాటు ఆసక్తి తగ్గుతుంది. అరగంట చదివిన తర్వాత చిన్న విరామం తీసుకుని కాస్త అటూ ఇటూ నడవడం, పచ్చని పరిసరాలను చూడడం వల్ల కళ్లకు విశ్రాంతి లభిస్తుంది. మెదడూ చురుగ్గా పనిచేస్తుంది. సన్నద్ధత విషయంలో అధ్యాపకులు, సీనియర్ల సలహాలూ, సూచనలు తీసుకోవడం మేలు చేస్తుంది. దీనివల్ల భయం తగ్గడంతో పాటు పరీక్ష విషయంలో అవగాహన పెరుగుతుంది. పరీక్షల ముందు పునశ్చరణ చేసుకుంటే సమయం ఆదా అవుతుంది. పరీక్షల ముందు కొందరు నిద్ర, పోషకాహారం, వ్యాయామాల గురించి అసలు పట్టించుకోరు. తగినంత నిద్ర లేకపోతే మెదడు చురుగ్గా పనిచేయదు. ఒత్తిడి తగ్గడానికి వ్యాయామాలు తోడ్పాటు అందిస్తాయి. పోషకాహారం తీసుకుంటే చురుగ్గా ఉండి పరీక్షలు సక్రమంగా రాయగలరు.

- బెండి సాయిరాం, మానసిక వైద్య నిపుణులు



సాగునీటికి సహకారమందేనా?

- నిధుల కొరతతో సతమతమవుతున్న సాగునీటి ప్రాజెక్టులు
- గత బడ్జెట్‌లో నామమాత్రంగా కేటాయింపులు
- కొత్త పథకాలు, ప్రాజెక్టులపై జిల్లావాసుల ఎదురుచూపులు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న ప్రభుత్వం

నిధుల కొరతతో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. జిల్లాలో ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు గత బడ్జెట్‌లో నామమాత్రంగా కేటాయింపులు చేసిన ప్రభుత్వం, ఆ మేరకు నిధులూ విడుదల చేయలేదు. భూసేకరణ, కాలువల తవ్వకాలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. వంశధార పనుల్లో కొంత పురోగతి కనిపిస్తున్నా, ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. తోటపల్లి పాత రెగ్యులేటరీ వ్యవస్థ ఆధునీకరణ పనులకు నిధులు విడుదల కాక ముందుకు సాగడం లేదు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటి సంక్షేమ పథకాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి అమలు చేయనున్నట్లు ప్రభుత్వం చెప్పడంతో, జిల్లాకు ఆ మేరకు ఎంతమేర కేటాయింపులు ఉంటాయోనన్న ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. వంశధార, ఆఫ్‌షోర్, జలవనరులశాఖ పరిధిలోని ప్రాజెక్టుల కోసం అవసరమైన నిధులు కేటాయించాలని కోరుతూ సంబంధిత అధికారులు ప్రతిపాదనలు పంపారు. వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-2కు సంబంధించి 87, 88 ప్యాకేజీ పనులు, హిరమండలం రిజర్వాయర్, వంశధార-నాగావళి నదుల అనుసంధాన పనుల కోసం మొత్తం రూ.191.32 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. ఆఫ్‌షోర్ పనుల కోసం రూ.167.68 కోట్ల అవసరమని ప్రతిపాదించారు. జలవనరుల శాఖ ద్వారా చేపట్టనున్న సాగునీటి ప్రాజెక్టుల కోసం గత బడ్జెట్‌లో ప్రతిపాదనలు పంపినా, ఒక్క పైసా కేటాయించలేదు. జలవనరుల శాఖ ద్వారా చేపట్టనున్న పనులకు రూ.480 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. పైడిగాం ఆధునీకరణ కోసం రూ.36 కోట్లు, ఓనిగెడ్డ ఆధునీకరణ కోసం రూ.12.50 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. గతేడాది ఈదుపురం సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈదుపురం ఓపెన్‌హెడ్ ఛానల్ కోసం రూ.21 కోట్లు అవసరమని ప్రతిపాదించారు.

నిధుల విడుదలలో కోత

గత బడ్జెట్‌లో వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులకు రూ.210 కోట్లు అడగ్గా, రూ.63.52 కోట్లు కేటాయించింది. ఆఫ్‌షోర్‌కు రూ.129 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా, రూ.38 కోట్లు ఇచ్చింది. అందులో ఇప్పటివరకు రూ.20.34 కోట్లు ఇచ్చింది. వంశధార-1కు రూ.20 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపగా రూ.కోటి మాత్రమే నిధులు కేటాయించింది.

'నేరడి'కి నిధుల కేటాయింపు జరిగేనా?

టిడిపి హయాంలో 2014-19 కాలంలో వంశధార-బాహుదా నదుల అనుసంధానం ప్రతిపాదనలు చేసి టెండర్లనూ పిలిచారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని రద్దు చేశారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులు నదుల అనుసంధానం చేస్తామంటూ పలు సందర్భాల్లో చెప్తున్నారు. నదుల అనుసంధానం జరగాలంటే నేరడి ప్రాజెకు పూర్తి కావాల్సి ఉంది. ఆ ప్రాజెక్టుకు భూసేకరణ, ఒడిశాలో సేకరించనున్న 106 ఎకరాలకు పరిహారం కోసం వంశధార ప్రాజెక్టు అధికారులు మూడేళ్లుగా రూ.60 కోట్ల అంచనాతో ప్రతిపాదనలను పంపుతూనే ఉన్నా, కేటాయింపులు చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వం దీనికి ఏమేరకు ప్రాధాన్యం ఇస్తుందో చూడాల్సి ఉంది.

ఐటిడిఎపై ప్రకటన ఉంటుందా?

ఎన్నికల సమయంలో జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. గత బడ్జెట్‌లో కనీసం దాన్ని ప్రస్తావించలేదు. ఈసారైనా ఐటిడిఎపై ఏమైనా ప్రకటన ఉంటుందా అని గిరిజనులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలకు నిధులు కేటాయిస్తారా?

సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్ కోసం ప్రభుత్వం ఏమేరకు నిధులు ఇవ్వనుందో మత్స్యకారులు ఎదురుచూస్తున్నారు. దీంతోపాటు ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బర్ నిర్మాణమూ నిధుల కేటాయింపుల్లేక ముందుకు సాగడం లేదు. వీటితోపాటు వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ప్రతిపాదించిన జెట్టీ నిర్మాణమూ ముందుకు సాగడం లేదు.

కొత్త ప్రాజెక్టులు ఏమైనా ఉంటాయా?

రాష్ట్ర విభజన తర్వాత జిల్లాకు ఇప్పటివరకు ఒక్క కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ గానీ విద్యాసంస్థలు గానీ రాలేదు. కనీసం రాష్ట్ర ప్రభుత్వమూ ఒక్క సంస్థనూ ఏర్పాటు చేయలేదు. జిల్లాలో భారత పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్) రిఫైనరీ ఏర్పాటు చేస్తామని ప్రకటించినా అది కృష్ణా జిల్లాకు తరలిపోయింది. ఈ బడ్జెట్‌లోనైనా ఏదైనా కొత్త ప్రాజెక్టు ప్రకటన ఉంటుందేమోనని సిక్కోలు ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.



ఇచ్ఛాపురం : నిందితులను ప్రవేశపెట్టిన డిఎస్‌పి వెంకట అప్పారావు

గంజాయితో తొమ్మిది మంది అరెస్టు

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఆరుగురు నిందితులను పట్టణ పోలీసులు రైల్వే స్టేషన్ సమీపంలో అరెస్టు చేసి వారి వద్ద నుంచి 47.480 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు కాశీబుగ్గ డిఎస్‌పి పి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా అమ్మకాలపై నిఘా పెట్టామన్నారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన మికిల్ సబారు, ప్రకాశ్ గమంగా, సుమంత్ సభారు, సుకుంత సభార్, తోవుత గమంగ, బబ్లూ గమంగ్ కేరళలో అమ్మకానికి తీసుకెళ్తున్నారని అన్నారు. బరంపురంలో బస్ ఎక్కి ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ నుచి కేరళ వెళ్లేందుకు సిద్ధమయ్యారని అన్నారు. స్టేషన్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న సమయంలో టౌన్ పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. సమావేశంలో సిఐ మీసాల చిన్నంనాయుడు, పట్టణ ఎస్ఐ ముకుందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ముగ్గురు...

పాతపట్నం : మండలంలోని అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద 20.85 కేజీల గంజాయితో ముగ్గురు నిందితులు పట్టుబడ్డారని డిఎస్‌పి ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. స్థానిక పోలీసులను నిందితులను విలేకరుల ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఒడిశా నుంచి తమిళనాడు రాష్ట్రానికి తరలిన్నారని, వారి బాగ్‌లను తనిఖీ చేయగా గంజాయి దొరికిందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, దానిని తల్లిదండ్రులు గమనించి వారిని సరైన రీతిలో పెట్టలేకపోతే వారికి కౌన్సెలింగ్ ఇచ్చి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టామని తెలిపారు. సమావేశంలో ఎఎస్ఐ శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ బి.వి.ఆర్.రెడ్డి, టి.తులసి, మహిళా కానిస్టేబుల్ వరలక్ష్మిలు పాల్గొన్నారు.

టెక్కలి సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

ప్రజాశక్తి- టెక్కలి



ఉమామహేశ్వరరావు

టెక్కలి సబ్ రిజిస్టర్ కార్యాలయ అధికారి ఉమామహేశ్వరరావు గురువారం సస్పెండ్ అయ్యారు. జిల్లా స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డిఐజి నాగలక్ష్మి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. ఎనీ వేర్ రిజిస్ట్రేషన్ చట్టంలో ఉన్న వెసులుబాటని తనకు అనుకూలంగా మార్చుకొని శ్రీకాకుళానికి చెందిన ఒక స్థలం టెక్కలిలో రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపై శాఖాపరమైన దర్యాప్తు నిర్వహించారు. ఈ దర్యాప్తులో సబ్ రిజిస్టర్ ఉమామహేశ్వరరావు అక్రమాలకు పాల్పడ్డాడని ప్రాథమిక విచారణ మేరకు సస్పెండ్ అయ్యారు. ఈయన గతేడాది సెప్టెంబరు 26న టెక్కలి సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు స్వీకరించారు.

6న రాష్ట్రస్థాయి డాక్ అదాలత్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పోస్టల్ కార్యాలయాల్లో అందించే సేవలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించనున్నట్లు పోస్టల్ సూపరింటెండెంట్ వి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి ఆరో తేదీన సర్కిల్ ఆఫీస్, విజయవాడలో చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కె.ప్రకాష్ స్వీకరించేందుకు నిర్ణయించారని పేర్కొన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు నీలంరాజు రంగారావు, అసిస్టెంట్ డైరెక్టర్ (ఫిర్యాదులు, నిర్వహణ), చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ సర్కిల్, విజయవాడ-520013 కార్యాలయానికి పోస్ట్ కవరుపై 'డాక్ అదాలత్' అని పెద్ద అక్షరాలతో రాసి పోస్టు ద్వారా ఈనెల 28వ తేదీలోగా పంపించాలని కోరారు. నేరుగా ఫిర్యాదుల పరిష్కారం కోసం మార్చి ఆరో తేదీన ఉదయం 11 గంటలకు డాక్ అదాలత్‌కు చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, ఆంధ్ర ప్రదేశ్ సర్కిల్, విజయవాడ -13లో హాజరు కావచ్చని తెలిపారు. డాక్ అదాలత్‌లో గూగుల్ లింక్ https://meet.google.com /wsw-jeqa-jyi ద్వారా మార్చి ఆరో తేదీ ఉదయం 11 గంటల నుంచి వర్చువల్‌గా పాల్గొనవచ్చని పేర్కొన్నారు. డాక్ అదాలత్‌లో ఫిర్యాదును పరిశీలించిన తర్వాత ఫిర్యాదుదారునికి ఫిర్యాదు, అర్జీ పరిష్కారం లేఖ, ఇ-మెయిల్ ద్వారా తెలియజేయనున్నట్లు తెలిపారు.

నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - కోటబొమ్మాళి



మంత్రి అచ్చెన్నాయుడు

జిల్లాలో వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని నీటిఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్‌తో గురువారం ఫోన్‌లో మాట్లాడి జిల్లాలో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా నీటిఎద్దడి ఎదురయ్యే గ్రామాలను గుర్తించి అక్కడ ఉన్న రక్షిత మంచినీటి పథకాలను మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఉద్దాన ప్రాంతానికి తాగునీరు అందిస్తున్న ప్రధాన రక్షిత మంచినీటి పథకం పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లాలోని ఇతర రక్షిత మంచినీటి పథకాల పనితీరుపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బోరుబావుల మరమ్మతులు చేపట్టాలని సూచించారు. తాగునీటి అవసరాలకు నిధుల కొరత లేదని, ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


ఆమదాలవలస : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్


లావేరు : పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి వివేకానంద


పొందూరు : పిడిఎఫ్ శిబిరం వద్ద యుటిఎఫ్, ప్రజాసంఘాల నాయకులు


మెళియాపుట్టి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి


పాతపట్నం : పోలింగ్ బాక్స్‌లను తరలిస్తున్న సిబ్బంది


కవిటిలో పోలింగ్ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- ఆమదాలవలస/ సరుబుజ్జిలి

ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల్లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఆమదాలవలస పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పోలింగ్ కేంద్రంలో 329 ఓట్లకు గాను 316 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. అలాగే సరుబుజ్జిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 57 ఓట్లకు గాను 53 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించి ఎన్నికల అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా విధులను నిర్వహించాలని ఎస్ఐ బాలరాజును ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల శిబిరాలను ఎమ్మెల్యే రవికుమార్ సందర్శించారు. అలాగే ఎమ్మెల్సీ అభ్యర్థి పోతల దుర్గారావు పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ ఆమదాలవలస పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియో గించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద సిఐ పాండ్రంకి సత్యనారాయణ, ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు.

మెళియాపుట్టి: మండలంలోని చాపర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 99 ఎమ్మెల్సీ ఓట్ల గాను, 94 పోలయ్యాయి. పురుషులు 73, మహిళలు 21 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పి.రమేష్‌బాబు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి ఆర్‌డిఒ ఎం. కృష్ణమూర్తి పరిశీలించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సురయ్య, ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు మద్దతుదారుల శిబిరాలను సందర్శించారు.

లావేరు: మండల కేంద్రంలోని జెడ్‌పి పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రం నెంబర్ 37లో నిర్వహించిన పోలింగ్‌లో 44 మంది ఓటర్లకు 42 మంది తమ ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఓటింగ్ 95.45 శాతం నమోదైందని ఎన్నికల అధికారి కె.సూర్యనారాయణ తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని శ్రీకాకుళం డిఎస్‌పి చెలమలశెట్టి వివేకానంద, లావేరు తహశీల్దార్ ఎస్ఐ జోగారావు, ఎంపిడిఒ పి. వెంకటరాజు పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రణస్థలం: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేశారు. మొత్తం 57 మంది ఓటర్లకు 54 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. తహశీల్దార్ ఎస్.ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పోలింగ్‌ను పర్యవేక్షించారు. జె.ఆర్.పురం ఎస్ఐ ఎస్.చిరంజీవి తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని అభ్యర్థి రఘువర్మ, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు సందర్శించారు.

పొందూరు: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్ర పరిధిలో 199 మంది ఓటర్లకు 191 మంది ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వద్ద శిబిరాలను విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కూన రవికుమార్ సందర్శించారు. పిడిఎఫ్ శిబిరం వద్ద యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ పొందూరు అప్పారావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు అమ్మనాయుడు ఓటర్లకు స్లిప్పులను పంపిణీ చేశారు.

జి.సిగడాం: ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి మండలంలో 84 మంది ఓటర్లు ఉండగా 82 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. 98 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారి తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పరిశీలించారు. ఈయన వెంట నాయకులు కుమరాపు రవి కుమార్, పైల విష్ణుమూర్తి ఉన్నారు.

బూర్జ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ కూటమి నాయకులతో కలిసి ఓటింగ్ స్లిప్పులు అందించే కేంద్రాన్ని పరిశీలించారు. ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా శతశాతం ఓటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ, నీటిసంఘం అధ్యక్షుడు కడగల కృష్ణ, జనసేన నాయకులు కొల్ల జయరాం, గౌరి తదితరులు పాల్గొన్నారు.

కవిటి: కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 94 ఓట్లకు గాను, 85 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 58, స్త్రీలు 27 ఉన్నారు. అగ్రికల్చర్ ఎడి కె.జగన్మోహనరావు సెక్టార్ అధికారిగా వ్యవహరించగా, డిటి కృష్ణమూర్తి పర్యవేక్షించారు.

ఇచ్ఛాపురం : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఇచ్ఛాపురం ప్రభుత్వ బాలికల కళాశాలలో ఏర్పాటు చేశారు. మొత్తం 111 ఓట్లకు గాను, 104 ఓట్లు పోల్ అయ్యాయని, ఇందులో పురుషులు 66, మహిళలు 38 మంది ఉన్నారని తహశీల్దార్ వెంకటరావు తెలిపారు. సిఐ మీసాల చిన్నంనాయుడు, ఎస్ఐ ముకుందరావు గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

టెక్కలి రూరల్ : ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రశాంతంగా ముగిశాయి. 254 ఓట్లు ఉండగా, 240 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారి బొడ్డేపల్లి రామారావు తెలిపారు. మహిళలు 82, పురుషులు 158 ఓటు హక్కు వినియోగించుకున్నారని అన్నారు. సిఐ అంబటి విజయకుమార్, ఎస్ఐ రామ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ రవికుమార్, ఎంపిడిఒ చింతాడ లక్ష్మీబాయి పర్యవేక్షించారు.

కోటబొమ్మాళి: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. 112 ఓట్లుకు గాను, 107 ఓట్లు పోలయ్యాయని ప్రిసైడింగ్ అధికారి ఎ.ప్రభాకర్ తెలిపారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4 గంటలతో ముగిసిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ సత్య నారాయణ సిబ్బందితో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

వజ్రపుకొత్తూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 78 మందికి గాను, 76 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 97.43 శాతం ఓటింగ్ నమోదయినట్టు అధికారులు చెప్పారు. 16 మంది మహిళా ఓటర్లకు గాను, 16 మంది, 62 మంది పురుష ఉపాధ్యాయులకు గాను, 60 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాన్ని ఆర్‌డిఒ గ్రంధి వెంకటేష్, తహశీల్దార్ సీతారామ్మూర్తి, ఎంపిడిఒ ఎన్. రమేష్‌నాయుడు పరిశీలించారు. కాశీబుగ్గ రూరల్ సిఐ తిరుపతిరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ ఎ.నిహార్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ఎటువంటి సంఘటన చోటుతావు లేకుండా ప్రశాంతంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు సెలవు ప్రకటించడంతో ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని 43 పంచాయతీల్లో ఉపాధ్యాయులు 102 ఓట్లు ఉండగా, 101 ఓట్లు పోలైనట్లు పోలింగ్ అధికారులు తెలిపారు. తహశీల్దార్ రవిచంద్ర పర్యవేక్షణలో పోలీస్ బందోబస్తు మధ్య పోలింగ్ నిర్వహించారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళిలో ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. గడువు ముగిసేసరికి 98 శాతం పోలింగ్ పూర్తయింది. 52 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, 51 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓట్లను వినియో గించుకున్నారు. ఎస్ఐ సింహాచలం ఆధ్వర్యాన బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి పరిశీలించారు.

పోలాకి: పోలాకి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎంఎల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసాయని తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ స్టేషన్ 32లో 93 ఓట్లు ఉండగా, 86 ఓట్లు పోలైనట్లు పిఒ రామచంద్రరావు తెలిపారు. ఇందులో పురుషులు 58, మహిళలు 28 మంది తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. సిఐ శ్రీనివాసరావు, ఎస్. దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన పటిష్టంగా బందోబస్తు నిర్వహించారు.

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా నిర్వహించిన బూత్ నంబరు 14 లో 98 ఓట్ల గాను, 94 ఓట్లు పోలయ్యాయి 95 శాతం నమోదైందని ఎన్నిక అధికారులు తెలిపారు. ఇందులో మహిళలు 31, పురుషులు 63 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.


పాతపట్నం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాన్ని టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి పశీలించారు. సిఐ రామారావు, ఎస్ఐ లావణ్య ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 270 ఓట్లకు గాను, 261 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని తహశీల్దార్ కిరణ్ కుమార్ తెలిపారు. అనంతరం బాక్స్‌లను ఆర్‌టిసి బస్‌లో తరలించారు.

పలాస : స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. 280 ఓట్లకు గాను, 273 ఓట్లు పోలై 96.8 శాతంగా నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని ఆర్డఇఒ జి.వెంకటేష్, తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తిలు పరిశీలించారు. కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ ఆధ్వర్యాన గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు

మందస : స్థానిక జెడ్‌పిహెచ్‌ఎస్ స్కూల్‌లో నిర్వహించిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మాల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిశాయి. కాశీబుగ్గ డిఎస్‌పి వి.వి.అప్పారావు దగ్గరుండి పరిశీలించారు. డ్రోన్ కెమెరాలు, వెబ్ కాస్టింగ్ వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు మండలంలోని 178 ఓటర్లకు గాను, 174 ఓట్లు పోలింగ్ అయ్యాయని ప్రొసీడింగ్ అధికారి హైమావతి తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం

- మూడు వేల సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు
- పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి
- డిఎస్‌పి సిహెచ్.వివేకానంద


మాట్లాడుతున్న డిఎస్‌పి వివేకానంద

ప్రజాశక్తి- లావేరు

గంజాయి రవాణా, వాడకాన్ని ఉక్కుపాదంతో అనిచివేసేందుకు గట్టి చర్యలు తీసుకున్నట్లు శ్రీకాకుళం డిఎస్‌పి చెలమలశెట్టి వివేకానంద తెలిపారు. గురువారం లావేరు పోలీస్‌స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీకాకుళం డివిజన్ పరిధిలో మార్చి నెలాఖరులోగా మూడువేల సిసి కెమెరాలు ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. సిసి కెమెరాలు నేర నియంత్రణకు, భద్రతకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సిసి కెమెరాల ఏర్పాటుకు సర్పంచ్‌లు తమ నిధులతో ఆయా ముఖ్య కూడళ్లలో, రహదారి ప్రారంభం, ముగింపు ప్రదేశాల్లో, జనసంద్రంగా ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో సర్పంచ్ రెండు చోట్ల కెమెరాలు ఏర్పాటుకు తమ నిధుల ద్వారా సహకరించాలని, అలాగే షాపుల నిర్వాహకులు సహకరించాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ తీసుకోవాలని, వారి ప్రవర్తనపై దృష్టి పెట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవడం జరుగు తుందని, స్టాపర్లు ఏర్పాటు, ప్రమాదాలపై ప్రజలుకు, వాహన దారులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈయనతో ఎస్ఐ లక్ష్మణరావు, ఎఎస్ఐ జగన్మోహనరావు, చక్రి ఉన్నారు.

కోలాటం ఆరోగ్యవంతమైన కళ


కోలాటం చేస్తున్న బృందం

రణస్థలం రూరల్: కోలాటం ఆరోగ్యవంతమైన కళని ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు అన్నారు. మండలంలోని బంటుపల్లి పంచాయతీ కంబాలపేటలో శ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం రాత్రి ఆలయ కమిటీ ఆధ్వర్యాన కోలాటం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రణస్థలం, లావేరు, విజయనగరం జిల్లా డెంకాడ, పూసపాటిరేగ మండలాల నుంచి సుమారు 10 టీమ్‌లు పాల్గొన్నాయి. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా రణస్థలం సీనియర్ డ్యాన్స్ మాస్టర్ టంకాల వాసు వ్యవహరించారు. మొదటి బహుమతి రణస్థలం మండలం పిషిణి శ్రీ పైడితల్లమ్మ కోలాట బృందం రూ.5 వేలు, రెండో బహుమతి పూసపాటిరేగ మండలం గుళివిందలపేట కనకదుర్గమ్మ కోలాట బృందం రూ.3 వేలు, డెంకాడ శ్రీ బంగారమ్మ తల్లి కోలాట బృందాలకు రూ.2 వేలు నగదు బహుమతులు, మెమోంటోలను ఎమ్మెల్యే చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలాటం శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎన్.రజని, పిసిని హరికృష్ణ, ధర్మకర్తలు వెలిచేటి సురేష్ కుమార్, రాయుడు, ఆలయ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలిచేటి సుధాకర్ కుమార్, రాజశేఖర్, కమిటీ సభ్యులు పిసిని అసిరప్పడు, అప్పలనాయుడు, ముంగం చిన్నరావు, రమణ, ప్రజలు పాల్గొన్నారు.

సభ్యత్వ కార్డులు పంపిణీ

నరసన్నపేట: టిడిపి సభ్యత్వం నమోదు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం సభ్యత కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ సభ్యత్వం పొందిన వారికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ బగ్గు అర్చన, నాయకులు చిట్టిబాబు, చంద్రశేఖర్, కృష్ణబాబు పాల్గొన్నారు.


కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జీడితోటలో మట్టి తవ్వితే చర్యలు

పోలాకి: మండలంలోని కోడూరు పంచాయతీలో ఉన్న జీడి తోటలో మట్టి తవ్వి అక్రమంగా తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపిడిఒ జి.రవికుమార్ హెచ్చరించారు. ఈ మేరకు జీడి తోటని తవ్విన మట్టిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రానికి దూరంగా ఉన్న మండల పరిషత్‌కి చెందిన ప్రభుత్వం తోటలో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు మట్టిని తవ్వి తరలిస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ ప్రాంతాన్ని ఉపాధి కూలీలతో తోటను బాగు చేయడానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ లోగా పెద్ద గొయ్యిలు తవ్వేసినట్లు కనిపించాయని అన్నారు. ఇక నుంచి పంచాయతీ కార్యదర్శులు రోజూ వచ్చి పరిశీలించాలని ఆదేశించారు. ఈయన వెంట సూపరింటెండెంట్ సూర్యప్రకాష్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, సర్వేయరు ఉన్నారు.


పరిశీలిస్తున్న ఎంపిడిఒ రవికుమార్

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని 33/11 కెవి ఆమదాలవలస సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి మెట్టక్కివలస టౌన్-2 ఫీడర్ పరిధిలో మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా ఈనెల 28న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెట్టక్కివలస, అమ్మానగర్, కుప్పిలివారి వీధి, ఊసవానిపేట, అలమాజీపేట, వాటర్ వర్క్స్ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని తెలిపారు. ప్రజలు గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

సరుబుజ్జిలి: మండలంలోని సరుబుజ్జిలి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగింపులో భాగంగా 28న విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మర్రిపాడు, షలంత్రి, కొత్తకోట, కొండ్రగూడ, వెన్నెలవలస, చిగురువలస, సుభద్రాపురం, రొట్టవలస, కొండవలస, రావివలస, పాలవలస, వెంకటాపురం పాలెం, పురుషోత్తపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని తెలిపారు.

కవిటి: మండలంలోని మాణిక్యపురం 11 కెవి ఫీడర్ మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మాణిక్యపురం పంచాయతీ పరిధిలో గ్రామాలకు, వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు సిబ్బంది సహకరించాలని కోరారు.

చిన్నారులకు దుస్తుల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: నగరానికి చెందిన ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు డా. కొంచాడ సోమేశ్వరరావు 86వ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని శాంతా కల్యాణ అనురాగ నిలయం, వృద్ధాశ్రమంలో చిన్నారులకు, వృద్దులకు నూతన వస్త్రాలను అందజేశారు. సేవా భావంతో చిన్నారులకు, వృద్దులకు దుస్తులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. వాకర్స్ గవర్నర్ కొంక్యాన మురళీధర్ మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను అందించడమే కాకుండా అనేక సేవా కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో సోమేశ్వరరావుతో పాటు కుమారుడు డా.రవి కుమార్, వనజ పాల్గొన్నారు.


చిన్నారులకు దుస్తులను అందజేస్తున్న సోమేశ్వరరావు


జెసిబితో తొలగిస్తున్న పశువుల షెడ్

పాఠశాల ఆక్రమణ తొలగింపు

రక్షణ గోడ నిర్మాణ పనులు వేగవంతం

లావేరు: మండల కేంద్రం లావేరు జెడ్‌పి పాఠశాల ఆక్రమణలకు గురైన విషయం విధితమే. ఆ స్థలంలో పశువుల షెడ్లు, షాపుల నిర్మాణంపై 'ప్రజాశక్తి' లో పలు కథనాలు వెలువడడంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పందించి సమగ్ర సర్వే నిర్వహించి అక్రమ నిర్మాణాలు తొలగించి పాఠశాల స్థలాన్ని పరిరక్షణ చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో పశువుల షెడ్ ఆక్రమణదారుడు రేకులు తొలగించడంతో గురువారం పాఠశాల ఎస్ఎంసి చైర్మన్ లంకలపల్లి రాంబాబు జెసిబితో పశువుల షెడ్‌ను తొలగించి పాఠశాల రక్షణగోడ నిర్మాణానికి పిల్లర్ గుమ్ములు తవ్వించారు. దీంతో పాఠశాల రక్షణగోడ నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి.

నేడు డిహెచ్‌పిఎస్ జిల్లా కార్యవర్గ సమావేశం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ కాశిబుగ్గ రెల్లి వీధిలోని అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు కోళ్ల చిన్నారావు, ప్రధాన కార్యదర్శి యడ్ల గోపి, కె.కైలాష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్వది సుబ్బారావు హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యాచరణ, ఎస్‌సి, ఎస్‌టి కేసులపై చర్చిస్తామని తెలిపారు. సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.


ఆస్పత్రిలో ఉన్న డయాలసిస్ యూనిట్లు

కిడ్నీ ఆస్పత్రికి రెండు డయాలసిస్ యూనిట్లు

పలాస : పలాసలోని కిడ్నీ ఆస్పత్రికి కొత్తగా రెండు డయాలసిస్ యూనిట్లు చేరుకున్నాయి. గ్లో స్వచ్ఛంద సంస్థ ఇటీవల కిడ్ని ఆస్పత్రికి సంస్థ ద్వారా రెండు డయాలసిస్ యూనిట్లు అందిస్తామని హామీ ఇచ్చిన విషయం తెలిసింది. ఈ హామీ మేరకు గురువారం రెండు డయాలసిస్ యూనిట్లు కిడ్ని ఆస్పత్రికి చేరుకున్నాయి. దీనితో ఇక్కడి వైద్యులు, రోగులు గ్లో సంస్థకు ధన్యవాదములు తెలిపారు.

సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చేదెప్పుడు..?

జి.సిగడాం: ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చేదెప్పుడని వైసిపి జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామ్మూర్తి, ఎచ్చెర్ల నియోజకవర్గ ఐటి వింగ్ అధ్యక్షుడు చిత్తిరి మోహన్ అన్నారు. గురువారం ఆనందపురం, దవళపేటలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయడం లేదన్నారు. వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసెంబ్లీలో కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారనే భయంతోనే ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు ప్రభుత్వం భయపడుతోందన్నారు. ఈ సమావేశంలో దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వర రావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీరామ్మూర్తి



రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన సూర్యారావు

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

మండలంలోని చిలకపాలెంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కందు సూర్యారావు (55) అక్కడికక్కడే మృతి చెందగా ఆయన భార్య సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. ఎచ్చెర్ల ఎస్ఐ సందీప్‌కుమార్ వివరాల మేరకు గార మండలం శ్రీకూర్మం పంచాయతీ బుద్దయ్యగారిపేటకు చెందిన కుందు సూర్యారావు, సావిత్రిలు రామతీర్థంలో ఆలయానికి వెళ్లి దర్శించుకుని తిరిగి ద్విచక్ర వాహనంపై వస్తుండగా చిలకపాలెం వద్ద హైదరాబాద్ నుంచి పశ్చిమబెంగాల్ వైపు వెళ్తున్న అంబులెన్స్ వెనుక నుంచి బలంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో సూర్యారావు అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య సావిత్రికి తీవ్ర గాయాలయ్యాయి. హుటా హుటిన స్థానికులు పోలీసుల సహాయంతో శ్రీకాకుళంలోని ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి అనుమానాస్పద మృతి


లోకేష్ (ఫైల్)

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఎచ్చెర్ల మండలానికి చినరావుపల్లి చెందిన విద్యార్థి అన్నెపు లోకేష్ (18) విజయనగరంలో బుధవారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. మృతుడు విజయనగరం పట్టణంలో ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. విజయనగరంలోని బొడ్డువారి జంక్షన్‌లో స్నేహితులతో కలిసి ప్రైవేట్ భవనంలో నివాస ముంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం అతని స్నేహితులు ఆయన సోదరుడు సంతోష్‌కి ఫోన్‌లో అందించిన సమాచారం మేరకు లోకేష్ ఆత్మహత్యకు పాల్పడినట్టు కుటుంబసభ్యులు భావించారు. హుటాహుటీన బయలుదేరి విజయనగరం చేరుకున్న తరువాత పలు అనుమానాలు వ్యక్తం చేయడంతో ఒన్‌టౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతుడు లోకేష్ డిగ్రీ చదువుతూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నాడు. కళాశాలలో స్నేహితురాళ్లతో మరో యువకుడు సన్నిహితంగా మెలగడాన్ని జీర్ణించుకోలేక ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని స్నేహితులు చెబుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు తండ్రి అన్నెపు గణేష్ భవన నిర్మాణకార్మికుడు కాగా తల్లి అమ్మాజమ్మ వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తున్నారు. సోదరుడు సంతోష్ డిగ్రీ పూర్తిచేసి ఇంటివద్దే తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. లోకేష్ మృతి వార్త జీర్ణించుకోలేక కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

బావిలోకి దూకి వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన లక్ష్మణ్ కుమార్

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి పంచాయతీ ఖాజీ పేటలో బుధవారం రాత్రి పల్ల లక్ష్మణ్ కుమార్ (34) అనే వ్యక్తి బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు మృతుడు పెయింటర్‌గా పనిచేస్తున్నాడని, అవసరాల నిమిత్తం పలువురు వద్ద అప్పులు చేయడంతో అప్పుల ఎక్కువయ్యని తెలిపారు. ఈ అప్పులపై బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో మాట్లాడిన తర్వాత బయటకు వచ్చి గ్రామంలో నేలబావిలోకి దూకగా బావిలో రాయి తలకు బలంగా తగిలింది. గమనించిన కుటుంబ సభ్యులు బయటికి తీయగా మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడు తండ్రి అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

యువకుడు అదృశ్యం


రాంప్రసాద్ (ఫైల్)

పొందూరు: మండలంలోని బాణాం గ్రామానికి చెందిన మక్క రాంప్రసాద్ అనే 19 ఏళ్ల యువకుడు మూడురోజుల క్రితం జరిగిన వత్సవలస జాతరలో అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులతో కలిసి వత్సవలస వెళ్లిన రాంప్రసాద్ కనిపించకుండా పోయాడు. యాత్రలో కుటుంబ సభ్యులు రాంప్రసాద్ కోసం వెతికినా కనిపించలేదు. యువకుడు కొద్ది రోజులుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. యువకుడు అదృశ్యంపై గార, పొందూరు పోలీస్‌స్టేషన్లలో యువకుడు తండ్రి రమణ ఫిర్యాదు చేశారు.


చెట్టును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

చెట్టును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

పొందూరు: మండలంలోని రెడ్డిపేట వద్ద గురువారం చెట్టును ఆర్‌టిసి బస్సు ఢీకొన్న సంఘటనలో త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. పాలకొండ నుంచి రాజాం మీదుగా విశాఖపట్నం వెళున్న ఆర్‌టిసి నాన్‌స్టాప్ బస్సు చెట్టును ఢీ కొనడంతో తొమ్మిది మందికి స్వల్ప గాయాలైయ్యాయి. పోలీసుల వివరాల మేరకు పాలకొండ నుంచి విశాఖపట్నం వెళ్తున్న బస్సు పొందూరు మండలంలోని రెడ్డిపేటకు చేరుకునే సరికి డ్రైవర్ లోపింటి రవి రెప్ప వాల్చడంతో నేరుగా చెట్టుకు ఢీకొట్టింది. అకస్మాత్తుగా జరిగిన పరిణామంతో సీట్లులో కూర్చొన్న ప్రయాణికులు ఎదురు సీట్లుకు ఢీకొట్టారు. బస్సు ముందు అద్దాలు పగిలిపోయాయి. ముందు భాగం దెబ్బతింది. గాయపడిన వారిని పొందూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమచికిత్స అందించారు. అనంతరం వారిని 108 వాహనంలో మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజనాస్పత్రికి తరలించారు. ఈ సంఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడలేదు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పొందూరు: మండలంలోని రాపాక కూడలి వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో కొంచాడ గ్రామానికి చెందిన పల్ల రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. సాయంత్రం రాములు రహదారి పక్కన నుంచి ఒక్కసారిగా రహదారిపైకి రావడంతో అదే సమయంలో అటుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో కిందపడ్డాడు. ట్రాక్టర్ రాములు కాలుపై నుంచి వెళ్లడంతో కాలు నుజ్జునుజ్జు అయింది. తీవ్రంగా గాయపడిన రాములును కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శ్రీకాకుళం ఆస్పత్రికి తరలించారు. రాములు భార్య సూరీడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

బెల్లం ఊటలు ధ్వంసం


సామగ్రిని స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పాతపట్నం: పాతపట్నం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మండలంలోని సవం సిద్ధమనుగు సమీపం బొన్ని గ్రామం తూర్పు కొండపై నాటు సారా కాస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్ సిఐ కోటా కృష్ణారావు తన సిబ్బందితో గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 200 లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. సమాచారం తెలుసుకున్న తయారీదారులు పరారయ్యాడు. అనంతరం నాటు సారా వల్ల కలిగే అనర్ధాలు, ప్రాణాంతకమైన వ్యాధుల గురించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అలాగే కోడూరుకు చెందిన సోమేష్ మద్యం బాటిళ్లతో పట్టుబడ్డారని సిఐ తెలిపారు. నాటుసారా అరికట్టేందుకు 14405 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.